క్లుప్తంగా

శావల్యాపురం తహసీల్దార్ బదిలీ

శావల్యాపురం: మండల తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సీసీఎల్ నుంచి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలల పాటు సేవలందించారు. తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డెప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

నాదెండ్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని నాదెండ్ల ఎస్‌ఐ జె.బలరామ్‌రెడ్డి హెచ్చరించారు. చందవరంలో ఆదివారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఆ గ్రామాల్లో రాత్రి కాలనీల్లో పర్యటించి అక్కడే నిద్ర చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగినా, ఎవరైనా గొడవలకు ఉసిగొల్పినా వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడిన శిక్షలు కఠినంగా ఉంటాయని పేర్కొన్నారు. బెల్టు షాపులు, పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే ఊరుకునేది లేదని, నిషేధిత గుట్కా, గంజాయి వంటి వాటి విక్రయాలు చేసే వారిని ఉపేక్షించమన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి గురించి తమకు సమాచారమివ్వాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీనిచ్చారు.

ఫేక్ వీడియో వైరల్‌పై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: పట్టణంలో జంట హత్యలు జరిగినట్లు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాన్ని వైరల్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సిహెచ్.కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ, పురుషుడు రామిరెడ్డిపేటలో హత్య చేయబడ్డారంటూ ఆదివారం సామాజిక మాల్లో వైరల్ అయింది. దీనిపై పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పందించి విచారణకు ఆదేశించారు. వీడియో నాలుగు రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో కొందరు యువకులు కావాలని వైరల్ చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఘటన నరసరావుపేటలో జరిగింది కాదని తేల్చారు. దీంతో ప్రజలను భయాందోళనకు గురిచేసే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన యువకులపై కేసు నమోదు చేశారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

రెంటచింతల: రెంటచింతలలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్సై ఎం.ఆంజనేయులు సోమవారం తెలిపారు. గ్రామంలోని ఎర్రబాలెం కాలనీలో టీడీపీ – వైఎస్సార్‌సీపీ వర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం వలన బోయిన చౌదయ్య, పేర్ల శ్రీనివాసులకు గాయాలైనట్లు వెల్లడించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాలలో ఎవరైనా ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడినా.. వ్యక్తిగత కారణాలతో ఘర్షణ పడి పార్టీల రంగు పులిమిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

క్రోసూరు: ఈ నెల 25 వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోందని ఎంపీడీవో టీవీ రమణ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆగస్టు 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ముగ్గురు అధికారులను పర్యవేక్షించే విధంగా ఫోన్ నంబరు 95426 03634 అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా క్రోసూరు, నాగవరం, దొడ్లేరు, అనంతవరం, బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

ఇసుక రీచ్‌లో దళారుల దందాపై చర్యలు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఉచిత ఇసుక పథకంలో దళారుల వసూళ్లపై ఇసుక తోడేస్తున్నారు కథనానికి స్పందన ఇసుక రీచ్‌లలో అధికారులు చర్యలు చేపట్టారు. వైకుంఠపురం ఇసుక రీచ్‌లోకి వాహనం రాగానే టోకెన్ ఇవ్వడం, టోకెన్ నంబరు ప్రకారం బిల్లు రాయడం పద్ధతిని అనుసరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సోమవారం నుంచి అమలు చేస్తున్నారు. అలాగే మునగోడు, మల్లాది గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరక్కుండా రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. ఇసుక రీచ్‌లలో సమస్యలు లేకుండా రవాణా సక్రమంగా సాగటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో శుభతిథి సహపంక్తి భోజనాలు

ముగిసిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం

యడ్లపాడు: వారంరోజులుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా శుభతిథి భోజన్ ఏర్పాట్లు చేశారు. పాఠశాల విద్యార్థులకు రోజుమాదిరిగా అందించే మధ్యాహ్న భోజనంతో పాటు పలు రకాల స్వీట్లను అందించారు. దాతల సాయంతో కొన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేయగా, కొన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమానికి దాతలెవరూ ముందుకు రాకపోవడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆ ఆర్థిక భారాన్ని తమపై వేసుకున్నారు. తమ సొంతనిధుల్ని వెచ్చించి స్వీట్లు, ఫ్రూట్స్ తీసుకువచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీంతో మండలం పరిధిలోని సర్కారు స్కూళ్లలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు లడ్డు, కేసరి, పాలకోవా, జాంగ్రీలు, పాలతాలికలు, సేమియా తదితర స్వీట్లు, పలు రకాల పండ్లు అదనంగా అందాయి.

న్యూ ఆంధ్ర పాఠశాలలో..

నరసరావుపేట: శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం శుభ్ దిన్ భోజన్ కార్యక్రమం న్యూ ఆంధ్ర మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. కేరళకు చెందిన రిటైర్డు చీఫ్ ఫారెస్టు అధికారి జూపూడి ప్రసాద్ విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. తాను కూడా వారితో కలిసి భోజనం చేశారు. శుభ్ దిన్ భోజన్ ఏర్పాటు చేసిన ప్రసాద్‌కు ప్రధానోపాధ్యాయురాలు ఎం.సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

శిక్షా సప్తాహ్‌లో తిథి భోజనం

బొల్లాపల్లి: శిక్షా సప్తాహ్‌లో భాగంగా చివరి రోజు సోమవారం తిథి భోజనం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె.పార్వతి మాట్లాడుతూ తిథి భోజనం వలన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఏర్పాటు చేయడమైందని తెలిపారు. సహపంక్తి భోజనాల్లో ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అపర్ణ, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి భోజనం చేశారు.


నరసరావుపేటలో విద్యార్థులతో పాటు భోజనం చేస్తున్న అతిథులు


బొల్లాపల్లిలో సహపంక్తి భోజనాలు చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

కేజీబీవీలో శుభ తిథి భోజనం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు సమాజంతో అనుబంధం ఏర్పరచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శిక్ష సప్తాహ్‌లో భాగంగా సోమవారం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో శుభతిథి భోజన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రమీల మాట్లాడుతూ, సామాజిక సంస్థలు తమ శుభ దినాలను విద్యార్థులతో కలసి పంచుకోవటం ద్వారా విద్యార్థులకు సామాజిక అనుబంధం ఏర్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చుక్కా వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

రొంపిచర్ల: మండలంలోని పాఠశాలల్లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తిథి – భోజనం కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన నారాయణం హరిబాబు ఏర్పాటు చేసిన మిఠాయిలను విద్యార్థులందరికీ అందజేశారు. అలాగే 10వ తరగతి విద్యార్థుల యొక్క అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ప్రతిరోజు పిల్లలకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. అలాగే పాఠశాల నిర్వహణపై, మధ్యాహ్న భోజన పథకంపై ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.


యడ్లపాడు జెడ్పీహైస్కూల్లో సహపంక్తి భోజనం

దాతల సహకారంతో పౌష్టికాహారం

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం ఇస్తున్న మెనూతో పాటూ దాతల సహకారం తీసుకుని అదనంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఎంఈఓ ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 22 నుంచి వారం రోజుల పాటూ శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం చివరిరోజు శుభదిన భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికంగా దాతల సహకారం తీసుకుని విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారం అందించాలన్నారు. గొరిజవోలు మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్వీటు, గారెలను అందించారు.


కేజీబీవీలో విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న పరిషత్ ప్రతినిధులు


గోగులపాడులో దాతలు సమకూర్చిన స్వీట్లు అందజేస్తున్న డెప్యూటీ డీఈఓ వేణుగోపాల్‌రావు


గొరిజవోలు ఎంపీయూపీ పాఠశాలలో పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

రొంపిచర్ల: వ్యవసాయంలో రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువులను తగ్గించి జీవన ఎరువులను వాడాలని డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని వడ్లమూడివారిపాలెంలో ఆత్మ గుంటూరు, జిల్లా వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం రైతులకు ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం అవలంబించటం ద్వారా నేలలో సేంద్రీయ కర్బనాన్ని పెంచవచ్చు అన్నారు. సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల మొక్కలకు మేలు చేసే నేలలో ఉన్న సూక్ష్మ జీవరాశులను పెంపొందించవచ్చు అన్నారు. అప్పుడే నేల సస్యశ్యామలం అవుతుందని వివరించారు. మొక్కలకు అవసరమైన పోషకాలన్నీ సేంద్రీయ ఎరువులతోనే అందుబాటులోకి వస్తాయన్నారు. జీవన ఎరువులను ఉపయోగించాలని కోరారు. రైతులు సాధ్యమైనంత వరకు రసాయన ఎరువులు, రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వ్యవసాయంలో రసాయనాలు తగ్గించినప్పుడే భూమి కలుషితం కాకుండా ఉంటుందన్నారు. తద్వారా మనం తినే ఆహారంలో కూడా రసాయనాల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. ఫాస్ఫేట్ ఎరువులను తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా పీఎస్‌బీ లేదా వీడీఎంని వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఏఈ ప్రసాదరాయ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

రొంపిచర్ల: మండలంలోని 18 రైతు సేవా కేంద్రాల ద్వారా కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సోమవారం తెలిపారు. రైతులు వీఆర్‌ఓల ద్వారా పొందవచ్చు అన్నారు. తమ వద్ద ఉన్న భూ రికార్డులు అందజేసి సీసీఆర్‌సీ కార్డులు పొందాలని ఆయన కోరారు. అలాగే కొన్ని గ్రామాల్లో సర్వే కారణంగా కార్డు మంజూరులో కొంత జాప్యం జరుగుతుందన్నారు. అలాంటి వారికి కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

బొల్లాపల్లి: నర్సరీ యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ అన్నారు. మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, సరికొండపాలెం గ్రామాల పరిధిలోని షేడ్‌నెట్ నర్సరీలను సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రబీ రసూల్ మాట్లాడుతూ 2010 నర్సరీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. షేడ్‌నెట్‌కు 9 నుంచి 14 అడుగల ఎత్తు వరకు ఇన్‌సెట్‌కు నెట్‌తో రక్షణ కల్పించాలని వివరించారు. డబుల్ డోర్ సిస్టమ్ కలిగి ఉండాలని, కీటకాలు లోపలికి ప్రవేశకుండా షేడ్‌నెట్‌కు ఎటువంటి రంధ్రాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నర్సరీ యజమానులు నాణ్యమైన విత్తనాలను వాడాలని సూచించారు. శుద్ధి చేసిన కోకో పిట్‌తో పోట్రేలలో మిరప విత్తనాలను ఏర్పాటు చేసి ఎత్తుగా ఉన్న మడులపై అమర్చాలని కోరారు. రైతులకు నాసిరకం నారు అందిస్తే నర్సరీ చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు మిరప నారును విక్రయించినా, లైసెన్స్ లేకుండా షేడ్‌నెట్స్ మిరపనారు వ్యాపారం చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు బి.కోహిని, నర్సరీ యజమానులు తదితరులు ఉన్నారు.


వెల్లటూరులో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయాలి

ఎంపీడీఓ కవితాచౌదరి

శావల్యాపురం: ప్రభుత్వ పథకాలు అమలు తీరులో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ కొర్రపాటి కవితాచౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వ పథకాలు విధి విధానాలపై సమీక్ష సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో శానిటేషన్ నిర్వహణపై కంట్రోల్ కమాండ్ అధికారులు టీమ్ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. మండలంలోని మతుకుమల్లిలో తాగునీటి పథకం పనిచేయటం లేదని త్వరితగతిన పనులు అయ్యేలా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు గాను గ్రామంలోని తాగునీటి చెరువు నిండా సాగర్ జలాలు నింపినట్లు ఈఓపీఆర్డీ పి.సుగుణ అన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ కవితాచౌదరి

కలుపు నివారణతో.. అధిక దిగుబడి

అమరావతి: మండలంలోఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాలలో పత్తి పంటలో ఇప్పటికే రైతులు కలుపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గత పదిహేను రోజులుగా వర్షాల కారణంగా రైతులు పొలాన్ని సరిగా దున్నక పోవడం, సిఫార్సు చేసిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం, సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల పంట పోలాల్లో కలుపు విపరీతంగా పెరిగిపోయింది. ఈ కలుపు వల్ల పంట దిగుబడి 12 నుంచి 51 శాతం వరకు తగ్గడంతో పాటు నాణ్యత తగ్గే ప్రమాదముంది. అనేక రకాల కలుపు మొక్కల వల్ల వివిధ రకాల తెగుళ్ల, పురుగులు ఆశ్రయించడంతో సాగులో ఖర్చు పెరిగి పోతుంది. రైతులు సకాలంలో కలుపును నిర్మూలిస్తే దిగుబడులు పెరిగి, ఖర్చు కూడా తగ్గే అవకాశముంది. మొక్కలు నాటిన తర్వాత తొలి ఆరు వారాలు కలుపు నివారణకు ఎంతో కీలకమైనది. ఏ రకం కలుపు మొక్కలను ఏ రకం మందులతో నిర్మూలించాలో రైతులు ముందుగా అవగాహన చేసుకోవాలి. పైరులో కలుపును నివారణకు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వేసుకోవాలి. పత్తి విత్తిన తర్వాత ప్రతి పది రోజులకు ఒకసారి కలుపు తీయించాలి. గ్రామీణ ప్రాంతాల పొలాల విస్తీర్ణానికి తగ్గట్టుగా కూలీల లభ్యత లేకపోవడంతో, ప్రస్తుతం కూలీ రేట్లు కూడా పెరగటంతో కలుపుల నివారణకు రైతులు రసాయనిక మందుల పైనే ఆధార పడుతున్నారు.

కలుపు నివారణకు సూచనలు

కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ రైతులకు వివరిస్తూ కలుపు మందులు వేసినప్పటికే ప్రత్తి పైరులో 25 నుంచి 30రోజుల వరకు పనిముట్లతో అంతర కృషి చేయాలన్నారు. పంటకు సరిపోయే కలుపు మందులు సరైన మోతాదులో సరైన సమయంలో వాడాలని సూచించారు.

విత్తనం వేయగానే 24 నుండి 48 గంటల లోపు కలుపు మందులు పిచికారి చేయాలని, కలుపు మందును పవర్ స్ప్రేయర్‌తో కాకుండా హ్యాండ్ స్ప్రేయర్‌తోనే స్ప్రే చేయాలని సూచించారు. భూమిలో బాగా పదును ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు చల్లడం లాభదాయకమని, కలుపు మందులు వేసిన తర్వాత కనీసం 6గంటల వరకు వర్షం పడకుండా ఉండాలని, కలుపు మందులను ఉదయం లేదా సాయంకాలం మాత్రమే పిచికారి చేయాలన్నారు. అలాగే వ్యవసాయాధికారుల సలహా మేరకు ఎకరాకు రెండు లీటర్ల పెండిమిథాలిన్, ఒక లీటరు గ్రామోక్సిన్‌ను 200 లీటర్లలో కలిపి మొక్కలపై పడకుండా పిచికారి చేయాలని వివరించారు.


దిడుగు గ్రామ సమీపంలో పత్తి పైరులో అంతర కృషి

ఆరుగురు జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని మునగోడు బ స్టాండు వెనుక ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో సోమవారం జూదమాడుతున్న అరుగురుని అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు దాడి చేయగా.. పేకాట ఆడుతున్న అరుగు రుని అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ. 7,420లు నగదును స్వాధీనంచేసుకున్నట్లు తెలి పారు. వీరిపై కేసునమోదుచేసి, సత్తెనపల్లికోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బెల్లంకొండ: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం చోటుచేసుకుంది. గేదె యజమాని పాకాలపాటి షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజు మాదిరిగా మేతకు గెదెను తీసుకెళ్లగా.. మధ్యాహ్న సమయంలో కొత్తపాలెం రోడ్డులో ఉన్న కాలువ సమీపంలో విద్యుత్ ఎర్త్ వైరు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎర్త్ వైర్ చుట్టూ ఫెన్సింగ్ వేయమని విద్యుత్ సిబ్బందికి ఎన్నోమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే తన గేదె చనిపోయినట్లు యజమాని వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మహబూబ్ తెలిపారు.

ఆదర్శానికి మారు పేరు డొక్కా సీతమ్మ

కారెంపూడి: ఆకలి తీర్చడం కోసం యావదాస్తిని, తన కష్టాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి డొక్కా సీతమ్మ అని, అలాంటి త్యాగమూర్తి పేరు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం పె ట్టడం ఆదర్శవంతమైన నిర్ణయమని జన సేన పా ర్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూసా రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో జన సేన కేడర్ పాల్గొని, విద్యార్థులకు స్ఫూర్తివంతమైన డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించాలని పేర్కొన్నారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, పార్టీ నాయకులు ఎస్‌ఎంకే నాయుడు, పాలెపోగు బాబు, మిరియాల అశోక్, కొండా పవన్, పలిశెట్టి వినయ్ పాల్గొని విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించారు.

తాగునీటికి శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే జీవీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించే సింగర చెరువును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ చెరువును సాగర్ జలాలతో నింపినట్లు చెప్పారు. పట్టణ ప్రజల తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లను మార్చడం జరిగిందన్నారు. రోజుమార్చి రోజు తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. రూ.159 కోట్లతో శాశ్వత తాగునీటి పథకాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సింగర చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నాదెండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి చివరి వరకూ నిర్వహించిన పనులపై మంగళవారం నుంచి ఆగస్టు 7వ తేదీ వరకూ సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–24లో 634 పనులకు గాను రూ.8,82,70206 విలువైన పనులు చేసినట్లు చెప్పారు. ఎస్‌ఆర్‌పీ లోకేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 587 పనులకు గాను వేతనాల రూపంలో రూ.6,22,61,000, మెటీరియల్ రూపంలో రూ.15,16,000 ఖర్చు చేసినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో 42 పనులకు గాను వేతనాల రూపంలో రూ.4,619, మెటీరియల్ రూపంలో రూ.2,23,39,352, నీటి సరఫరా విభాగంలో 5 పనులకు గాను మెటీరియల్ రూపంలో రూ.21,48,000 ఖర్చు చేసినట్లు చెప్పారు. ఆయా పనుల సామాజిక తనిఖీ అనంతరం ఆగస్టు 8వ తేదీ ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షత వహించగా, ఏపీఓ పుష్పరాజు, ఏఈ పీఆర్ రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు

చిలకలూరిపేట: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఉందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ పేర్కొన్నారు. సంఘ ఆధ్వర్యంలో సోమవారం డెప్యూటీ తహసీల్దార్ ఎస్.రవికుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం పటిష్టమైన చట్టం చేయాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల వారు వారి పేర్ల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఐఐటీ ఫౌండేషన్ వంటి పేర్లు తగిలించుకుంటున్నారని విమర్శించారు. విద్యా సామగ్రితో పాటు, యూనిఫాం వంటివి వారి పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను అవస్థలకు గురి చేస్తున్న విద్యాసంస్థలను గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.చిన్నానాయక్, దేవర డేవిడ్, ఆర్.శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.


డెప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

కళాశాల పీపుల్ లీడర్ ఎన్నికలు

సత్తెనపల్లి: విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాలలో పీపుల్ లీడర్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని వేద కళాశాల ప్రిన్సిపల్ అరుణ తెలిపారు. పట్టణంలోని వేద జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు తమ ప్రతినిధిని ఎన్నుకొనేందుకు ఎన్నికలు నిర్వహించారు. ప్రచారం, నామినేషన్, బ్యాలెట్, చేతికి సిరా గుర్తు, సీక్రెట్ ఓటింగ్, తదితర ఎన్నికల ప్రక్రియ మొత్తం నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల విధానంపై మంచి అవగాహన పొందారు. కళాశాల పీపుల్ లీడర్, కళాశాల వైస్ పీపుల్ లీడర్‌లను ఎన్నుకునేందుకు విద్యార్థులు ఈవీఎంల మాదిరి యంత్రం ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో సైదా నాయక్, విక్రమ్ సింహ, అనూష, ప్రియ సూర్య ప్రకాష్ పాల్గొని, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


సిరా చూపుతున్న విద్యార్థినులు